జాతీయ దినపత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 184 | సోమవారం | 20-7-2026




PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08



# జగజ్జేత స్పెయిన్

- రెండోసారి ప్రపంచకప్ టైటిల్ సొంతం
- ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాపై విజయం
- అదనపు సమయంలో గోల్ కొట్టిన స్పెయిన్
- అసాధారణ ప్రదర్శన కనబరిచిన అర్జెంటీనా గోల్‌కీపర్

5లో

మెస్సీ నాయకత్వంలోని ఫార్వర్డ్స్ పూర్తిగా తేలిపోయిన వేళ నిర్ణీత 90 నిమిషాల పాటు అర్జెంటీనా కీపర్ ఎమిలియానో అడ్డుగా నిలిచినా, ఎక్స్‌ట్రా టైమ్‌లో సాగిన స్పెయిన్ దండయాత్రను ఆపలేకపోయాడు. 106వ నిమిషంలో ఫెర్రన్ టోరెస్ కొట్టిన బుల్లెట్ లాంటి గోల్‌తో అర్జెంటీనా కోట బద్దలైంది. ఈ చరిత్రాత్మక విజయంతో పురుషుల, మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టైటిళ్లను ఒకేసారి కైవసం చేసుకున్న తొలి దేశంగా స్పెయిన్ సాకర్ చరిత్రను తిరగరాసింది. మరో కప్పు నెగ్గి కెరీర్‌ను ఘనంగా ముగించాలని ఆశించిన మెస్సీ కన్నీళ్లతో తన పోరాటం ముగించాడు!!



# గాంధీభవన్‌కు రావొద్దు..

- నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు!
- ఎస్ఐఆర్‌పై రేవంత్ కఠిన ఆదేశాలు
- ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని నేతలకు సూచన
- గాంధీభవన్‌కు రావొద్దన్న సీఎం
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- ఉత్తమ 100 బీఎల్ఏలకు రాహుల్‌తో కలిపిస్తామని హామీ



ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచారం తరహాలోనే సీరియస్‌గా తీసుకోవాలని, రానున్న పది రోజుల పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు మూడో తేదీ వరకు పొడిగిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని ఒక అవకాశంగా తీసుకోవాలని, అప్పటివరకు నియోజకవర్గాల్లోనే ఉండి ఓటర్ల జాబితా సవరణపై దృష్టి పెట్టాలని సూచించారు. చైర్మన్ పదవులు, పార్టీ పోస్టులు కావాలని

- మిగతా 2వ పేజీలో

# నేటి నుంచి వర్షాకాల సమరం


**పార్లమెంట్ ఉభయసభల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్న కేంద్రం**

**ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమైన విపక్షాలు**

న్యూఢిల్లీ: పలు రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీల్లో చీలికలు, ఎంపీల ఫిరాయింపులు, ప్రభుత్వ అనుకూల కూటముల్లో చేరికల మధ్య పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రాంతీయ పార్టీల్లో నెలకొన్న విభేదాల కారణంగా అధికార ఎన్డీయే బలం పెరగడం, అనైక్యతతో కొట్టుమిట్టాడుతున్న విపక్షాల 'ఇండియా' కూటమి కొంత బలహీనపడిన నేపథ్యంలో ఈ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సమావేశాల్లో ఐదు


# ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా
# భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- జీఎంఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్ తొలిదశ వ్యయం రూ. 4,592 కోట్లు
- తొలిదశలో ఏటా 63 లక్షల మంది ప్రయాణికులకు సేవలు



ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. విశాఖపట్నం సమీపంలోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో గత కొంతకాలంగా ప్రారంభోత్సవ తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం సాయంత్రం విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, ఈ కీలక ప్రకటన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని

- మిగతా 2వ పేజీలో



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# అఖిలపక్ష భేటీలో రగడ

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే రాజకీయ యుద్ధం మొదలైంది. ఆదివారం పార్లమెంట్ భవనంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్ సహా 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున పార్టీ పార్లమెంటరీ పక్ష నేతలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు ఎంపీలను ఈ సమావేశానికి ఆహ్వానించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎన్‌సీపీఐ)లో టీఎంసీ రెబెల్ ఎంపీల విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఇంకా అధికారికంగా పూర్తిస్థాయి ఆమోదం తెలపలేదని, రికార్డుల ప్రకారం తమ పార్టీ బలం ఇంకా 28గానే ఉందని తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా ప్రస్తావించారు. టీఎంసీ రెబల్స్‌ను అఖిలపక్ష భేటీకి పిలిచినందుకు నిరసనగా కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, శివసేన(యూబీటీ), డీఎంకే, ఆప్, జేఎంఎం, ఆర్జేడీ సహా వామపక్ష పార్టీల నాయకులు అఖిలపక్ష సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి మళ్లీ అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 131వ రాజ్యాంగ సవరణ బిల్లు--2026(లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచే డీలిమిటేషన్ బిల్లు)పై కాంగ్రెస్ సభ్యులు ఖర్గే, ప్రమోద్ తివారీ నిరసన వ్యక్తం చేశారు. నీట్--యూజీ పేపర్ లీకేజీలు, అయోధ్య రామాలయ ట్రస్టులో కోట్ల రూపాయల విరాళాల చోరీ, ఈ20 పెట్రోల్ వంటి అంశాలను పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్‌చేశారు. నియోజకవర్గాల పునరి?వభజన బిల్లుకు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ) మద్దతు ఇస్తుందంటూ వస్తున్న ఊహాగానాలను ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే కొట్టిపారేశారు. అయోధ్య రామమందిర విరాళాల చోరీ, ఇథనాల్ బ్లెండింగ్, విద్యార్థుల సమస్యలు, మణిపూర్లో కల్లోలం తదితర కీలక సమస్యలు, తాజా పరిణామాలపై వర్షాకాల సమావేశాల్లో తప్పనిసరిగా చర్చించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డీఎంకే సభ్యుడు టిఆర్ బాలు విన్నవించారు. శివసేన(యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు షిండే సారథ్యంలోని శివసేన పార్టీలో చేరడం, వారి విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఆమోదం తెలపడం అన్యాయమని శివసేన(యూబీటీ) సభ్యుడు అరవింద్ సావంత్ స్పష్టంచేశారు. తమ పార్టీకి చెందిన 10 మంది రాజ్యసభ సభ్యుల్లో ఏడుగురు బీజేపీలో చేరడాన్ని 'హైజాక్'గా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎన్.డి.గుప్తా అభివర్ణించారు. ఇది చెల్లుతుందా లేదా అని తేల్చాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు.

**సభలు సజావుగా సాగేలా సహకరించండి**

ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై పార్లమెంటరీ నిబంధనలను లోబడి సమగ్రమైన చర్చలు జరపడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి రాజ్‌నాథ్ వెల్లడించారు. సభలో గందరగోళం సృష్టించడం కంటే అర్థవంతమైన చర్చలకే ప్రాధాన్యం ఇవ్వాలని విపక్షాలను కోరారు. చట్టసభల సమయం వృథా కాకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ఉభయ సభల కార్యకలాపాలు సజావుగా సాగడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో ఎనిమిది బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు రిజిజు చెప్పారు. గతంలో మెజార్టీ లేక ఆమోదం పొందని రాజ్యాంగ సవరణ బిల్లులపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

# కేటీఆర్ రక్తంలో నిజాయితీ, కృతజ్ఞత లేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరూర్ నగర్ సభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై కేటీఆర్ 'డెత్ డిక్లరేషన్' అంటూ మాట్లాడటంపై ఆయన తీవ్ర కౌంటర్ ఇచ్చారు. అసలు కేటీఆర్‌కు ఏమాత్రం రాజకీయ నియత్ (నిజాయితీ) ఉందా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. విలువలతో కూడిన రాజకీయం గాంధీ కుటుంబానిదైతే.. విలువలు లేని రాజకీయాలు కేసీఆర్ కుటుంబానివని మండిపడ్డారు. ఆనాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇస్తే సోనియా గాంధీకి తన చర్మం వొలిచి చెప్పులు కుట్టిస్తానని కేసీఆర్ అన్న మాటలను జగ్గారెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీ కాళ్లు మొక్కిన సంగతిని ఇప్పుడు ఎలా మర్చిపోతారని నిలదీశారు. నాడు కాళ్లు మొక్కి, ఇప్పుడేమో అదే గాంధీ కుటుంబంపై డెత్ డిక్లరేషన్ ప్రకటిస్తావా అంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. కేటీఆర్ రక్తంలో ఎక్కడా నిజాయితీ, కృతజ్ఞతా భావం లేవని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఆ కుటుంబం నాశనాన్ని కోరుకోవడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1 పేపర్ లీక్ అయినప్పుడు, కేటీఆర్ అశోక్ నగర్ వెళ్లి ఏ రోజైనా నిరుద్యోగులకు సమాధానం చెప్పారా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. నాడు నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుని, ఇవాళ నీతులు చెబుతున్నారని విమర్శించారు. గాంధీ కుటుంబం ఏనాడైనా మాట ఇస్తే దానికి కట్టుబడి నిలబడుతుందని, కానీ కేసీఆర్ కుటుంబం మాత్రం మాట ఇస్తే మోసం చేయడమే అలవాటుగా మార్చుకుందని దుయ్యబట్టారు.

# చల్లారని పశ్చిమాసియా

దుబాయ్, జూలై 19: పశ్చిమాసియాలో 8వ రోజు కూడా దాడులు కొనసాగాయి. జోర్డాన్‌లో అమెరికా దళాలపై శనివారం ఇరాన్ చేసిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ లక్ష్యాలపై విరుచుకుపడినట్టు యూఎస్ మిలిటరీ ఆదివారం ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ సైనిక కోస్తా నిఘా, వాయు రక్షణ వ్యవస్థలు, క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలపై దాడులు చేసినట్టు తెలిపింది. ఈ దాడిని ఇరాన్ అటామిక్ ఎనర్జీ ఆర్గనైజేషన్ ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఆరోపించింది. ఈ దాడిపై అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) స్పందించింది. తమ సంస్థ సభ్యులు గతంలో ఆ కేంద్రాన్ని సందర్శించినప్పుడు, అది నిర్మాణ దశలో ఉందని అందులో ఎలాంటి అణు పదార్థాలు లేవని తెలిపింది.

# నేటి నుంచి వర్షాకాల సమరం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త బిల్లులు, రెండు పెండింగ్ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. అయోధ్యలోని రామాలయంలో కోట్ల కొలది విరాళాల చోరీ, నీట్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, మోదీ సర్కార్ విదేశాంగ విధానంపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తగిన సంఖ్యాబలం లేక వీగిపోయిన మహిళా రిజర్వేషన్ల బిల్లు, లోక్‌సభ నియోజకవర్గాల డీలిమిటేషన్ రాజ్యాంగ సవరణ బిల్లులను ఈసారి అజెండాలో లేకపోయినా వీటిపై ముందుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దేశంలో పన్నుల వ్యవస్థను మరింత సరళీకృతం చేయడం, కొన్ని నిబంధనలను సవరించడం, పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించడమే లక్ష్యంగా ఆదాయపు పన్ను(సవరణ) బిల్లు--2026ను వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. విదేశీ నిధులు స్వీకరించే సంస్థలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు, పారదర్శకత పెంపు, పర్యవేక్షణను బలోపేతం కోసం విదేశీ విరాళాల నియంత్రణ(సవరణ) బిల్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రుణ సౌలభ్యం, వ్యాపార నిర్వహణలో సరళీకరణ, పెట్టుబడుల ప్రోత్సాహం కోసం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్కరణ బిల్లు, పుట్టిన తేదీ నమోదు, డిజిటల్ రికార్డులు, పరిపాలనా ప్రక్రియలను మరింత సమర్థవంతంగా మార్చే ప్రతిపాదనతో జనన నమోదు చట్ట సవరణ బిల్లుతోపాటు జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగ విలువలకు సంబంధించిన చట్టాలను నవీకరించేందుకు జాతీయ గౌరవ అవమాన నివారణ(సవరణ) బిల్లు--2026ను కేంద్రం ప్రవేశపెట్టనుంది. రెండు పెండింగ్ బిల్లులను తదుపరి ఆమోదం కోసం పార్లమెంట్ ముందుకు తీసుకురానుంది. ఇందులో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు వీలుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య(సవరణ) బిల్లు ఉంది. పెరుగుతున్న కేసుల భారం తగ్గించి, పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే ధ్యేయంగా ఈ బిల్లును రూపొందించారు. ఉన్నత విద్యా రంగంలో సంస్కరణల కోసం వికసిత్ భారత్ విద్యా అధిష్టాన్ బిల్లు--2025ను సైతం కేంద్రం ప్రవేశపెట్టనుంది.

**అవినీతి, ధరల పెరుగుదల..**

వర్షాకాల సమావేశాల్లో మోదీ ప్రభుత్వం విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతి, రాజ్యాంగబద్ధ సంస్థల దురి?వినియోగం, విపక్షాలను విచ్ఛిన్నం చేయడం, ధరల పెరుగుదల, విదేశాంగ విధానంలో వైఫల్యాలు, వ్యూహాత్మక తప్పిదాలు, ఇథనాల్ బ్లెండింగ్ విధానాలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలపై దాడులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్ సన్నద్ధమైంది. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడంపైనా ఆందోళన చేపట్టాలని ప్రతిపక్షాల నిర్ణయించాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఉభయ సభల్లో డిమాండ్ చేయబోతున్నాయి. 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతు పలకడం, శివసేన(యూబీటీ)లో చీలికలు, డీఎంకే దూరం జరగడం వంటి పరిణామాల నేపథ్యంలో విపక్షాల ఐక్యత, బలం కాస్తంత తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని విపక్ష నాయకులు ఎంతమేరకు ఎదుర్కొంటారన్నది చూడాల్సి ఉంది. సమావేశాలు వాడీవేడిగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. జాతీయ గేయం 'వందేమాతరం'ను అవమానించడం, ఆలాపనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం నేరంగా పరిగణించేలా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్‌సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (సవరణ) బిల్లు--2026'ను నేడు రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుకు ఇప్పటికే కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తే, ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జనగణమన'కు ఉన్న చట్టపరమైన రక్షణ 'వందేమాతరం'కూ వర్తించనుంది.

# రామాయపట్నం పోర్టుపై జగన్ ట్వీట్...

రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

**రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం**

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

# ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమానాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి.

# ఏపీలో మళ్లీ కరోనా కలకలం..

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పెరుగుతున్నాయి. తాజాగా నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు కొత్త కేసులు వెలుగులోకి రావడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివరాల్లోకి వెళ్తే, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స నిమిత్తం పుదుచ్చేరిలో ఉండగా, అతనికి కరోనా సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, బాలుడి కుటుంబ సభ్యులకు, సమీప బంధువులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ అని తేలింది. మరోవైపు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో డయాలసిస్ చేయించుకుంటోంది. జ్వరం, ఇతర లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా, ఆమెకు కోవిడ్ పాజిటివ్‌గా తేలింది.

# గాంధీభవన్‌కు రావొద్దు..

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులు గాంధీభవన్‌కు రావొద్దు. అలాంటి వారికి అసలు అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చుని పనిచేయడం లేదు. హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు..' అని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ పనితీరు గురించి ఆదివారం ఆయన జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

**30న మళ్లీ సమీక్ష**

'ఎస్ఐఆర్‌పై పార్టీ పక్షాన ఇప్పటివరకు 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 489 సమావేశాలు జరిగాయి. కొన్ని చోట్ల బాగానే జరుగుతున్నా మరికొన్ని చోట్ల వెనుకబడ్డాం. ఇప్పటికైనా ఆయా నియోజకవర్గాల్లోని నేతలు ఎస్ఐఆర్‌పై దృష్టి పెట్టాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎస్ఐఆర్ కోసం నియమించిన పార్టీ ఇన్‌చార్జిలు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. బీఎల్ఏ, బీఎల్‌వోల రిపోర్టులను గాంధీభవన్ టీం ఎప్పటికప్పుడు పరిశీలించి సూచనలివ్వాలి. ఇన్‌చార్జి మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలి. ఏది జరిగినా వారిదే బాధ్యత. ఈ నెల 30వ తేదీన మళ్లీ పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించి మరోమారు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు తీసుకుంటాం..' అని రేవంత్ స్పష్టం చేశారు.

**100 మందికి రాహుల్‌తో ఫొటోకు చాన్స్**

'జిల్లాల వారీగా ఎస్ఐఆర్ కార్యక్రమాలపై అన్ని జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సోమవారం సమీక్షలు జరుపుతారు. ఎంపీలు పార్లమెంటు సమావేశాల్లో ఉన్నా ఎస్ఐఆర్‌పై దృష్టి సారించాల్సిందే. పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌చార్జిలుగా ఉన్నవారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. ఇన్‌చార్జిలుగా ఎంపీలున్నా క్షేత్రస్థాయికి వెళ్లి పనిచేయాల్సిందే. లేదంటే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుంది. పూర్తిగా బీఎల్‌వోల రిపోర్టులపై ఆధారపడొద్దు. బీఎల్ఏల రిపోర్టులను పరిశీలించాలి. పార్టీ పరంగా పనిచేస్తున్న నేతలు ఈ బీఎల్ఏలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. అలా ఉపయోగించుకోవాలంటే పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండి పనిచేయాలి. ప్రతి ఒక్కరు సీరియస్‌గా ఉండాలి. బాగా పనిచేసే 100 మందికి రాహుల్‌గాంధీతో ఫొటో దిగే అవకాశం కల్పిస్తాం. ఎస్ఐఆర్ విషయంలో పార్టీ కార్యక్రమాలన్నింటికీ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం కభట్టి విక్రమార్క బాధ్యత తీసుకోవాలి. అందరినీ సమన్వయం చేయాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు.

**జాగ్రత్తగా వ్యవహరించాలి: మహేశ్‌గౌడ్**

టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా కీలకమైందని, ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని, చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం ద్వారా పార్టీకి జరిగిన నష్టాన్ని గుర్తించైనా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోకుండా జాగ్రత్త తీసుకోవాలని మహేశ్‌గౌడ్ కోరారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




# కరుణించు వరుణ దేవా.. బొడ్రాయికి గిరిజన రైతుల జలాభిషేకం

- పుట్టగూడెంలో వేడుకగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- వానల కోసం ఆకాశం వైపు చూస్తున్న కర్షకులు
- ముఖ్య అతిథిగా ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ విఠల్ నాయక్

**తొలివెలుగు, రాజాపేట:** వర్షాకాలం సగం గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడిని కరుణించమని కోరుతూ రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాడోత్ రాంజీ నాయక్ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులందరూ కలిసి ఊరిలోని బొడ్రాయి వద్దకు చేరుకుని ప్రత్యేకంగా జలాభిషేకం చేశారు. అనంతరం బొడ్రాయిని పూలతో అందంగా అలంకరించి, నారికేళం (కొబ్బరికాయ) సమర్పించారు. పాడిపంటలు సుభిక్షంగా ఉండి, సకాలంలో వానలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడోత్ విఠల్ నాయక్, గిరిజన రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- రూ.5 వేలు అందజేసిన జైశ్రీరామ్ ఫౌండేషన్
- పరామర్శించిన సర్పంచ్ కోయ మధు



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం కేంద్రానికి చెందిన ఎర్రగోకుల లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం వారి కుటుంబాన్ని జైశ్రీరామ్ ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితులకు తక్షణ సాయంగా రూ.5,000ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోయ మధు మాట్లాడుతూ.. లక్ష్మయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబానికి జైశ్రీరామ్ ఫౌండేషన్ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులతో పాటు దాచేపల్లి రాజు, గండ్ల నర్సింగరావు, చిగుళ్ల బిరయ్య, దాచాపల్లి శ్రీనివాస్, సాధనబోయిన శంకర్, బిర్రు సురేష్, మాల్యాల భారత్, దేశాపండ ప్రసాద్, కాకళ్ల సిద్ధులు, ఎర్రగోకుల కృష్ణ, జస్వంత్, వినోద్, చింతల కృష్ణ, కోటయ్య, ఎండీ కాజా మరియు మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- ఆగస్టు 1న తపస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ధర్నా
- పోస్టర్ ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు దుడుక జానయ్య

**తొలివెలుగు, రాజాపేట :** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ సంఘం (తపస్) రాజాపేట మండల అధ్యక్షుడు దుడుక జానయ్య డిమాండ్ చేశారు. ఆగస్టు 1న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం ఎల్బీనగర్‌లో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు వోడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుడుక జానయ్య మాట్లాడుతూ.. ఉద్యోగుల కోసం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ నివేదికను వెంటనే విడుదల చేసి 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయడంతో పాటు పెన్షనర్ల బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేస్తూ సుప్రీంకోర్టులో ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్పీని ఉపసంహరించుకోవాలని కోరారు. 317 జీవో బాధితులకు 190 జీవో ప్రకారం అర్హులందరికీ డిప్యుటేషన్లు కల్పించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లిస్తూ విద్యాశాఖలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలం వేతనాలు చెల్లించి, ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 1న నిర్వహించే రాష్ట్రవ్యాప్త ధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని దుడుక జానయ్య పిలుపునిచ్చారు.



## తొలివెలుగు ఇంపాక్ట్

# రాచకొండ మైసమ్మ గుడిలో పార్కింగ్ అక్రమ వసూళ్లకు బ్రేక్!

- 'రెవెన్యూ ఒకరిది.. పెత్తనం మరొకరిది!' కథనానికి దిగొచ్చిన నిర్వాహకులు
- ఫ్లెక్సీ ఏర్పాటు చేసి పార్కింగ్, అర్చన టికెట్లు నిలిపివేత
- అధికారుల చర్యల భయంతోనే నిర్ణయమా..? భక్తుల్లో చర్చ
- మిగిలిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని భక్తుల డిమాండ్
- ఏళ్ల నాటి దందాకు 'తొలివెలుగు'తో చెక్.. పారదర్శక పరిపాలనకు తొలి అడుగు
- అక్రమ వసూళ్లను వెలుగులోకి తెచ్చిన 'తొలివెలుగు'కు భక్తుల అభినందనలు




తొలివెలుగు ఎఫెక్ట్

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రాచకొండ శ్రీ సరళ మైసమ్మ దేవాలయంలో పార్కింగ్ పేరిట కొనసాగుతున్న అక్రమ వసూళ్లు, ఆలయ పరిపాలనలో పారదర్శకత లోపం, ప్రభుత్వ భూముల ఆక్రమణలు తదితర అంశాలపై 'తొలివెలుగు' దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనం సంచలనం సృష్టించింది. "రెవెన్యూ ఒకరిది.. పెత్తనం మరొకరిది!" అనే శీర్షికతో వెలువడిన కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో పాటు సంబంధిత అధికారుల దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆలయ నిర్వాహకులు వెంటనే స్పందించి, ఇన్నాళ్లుగా కొనసాగుతున్న పార్కింగ్ వసూళ్లను నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

**ఫ్లెక్సీ ఏర్పాటు... ఉచిత పార్కింగ్ ప్రకటన:**

వార్త ప్రచురితమైన కొద్ది గంటల్లోనే ఆలయ ఆవరణలో నిర్వాహకులు భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో "కొన్ని అనివార్య కారణాల వలన పార్కింగ్ మరియు అమ్మవారి అర్చనకు ఎటువంటి టిక్కెట్లు తీసుకోబడవు" అని స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే "భక్తులందరికీ పూజలు మరియు పార్కింగ్‌కు సంబంధించిన టిక్కెట్లు తీసుకోబడవు" అని పెద్ద అక్షరాలతో ప్రకటించారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇకపై ఎలాంటి రుసుము చెల్లించకుండా పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

**'తొలివెలుగు' కథనానికి ప్రత్యక్ష ఫలితం:**

ఇంతకాలం ఎలాంటి అధికారిక టెండర్లు లేకుండానే ద్విచక్ర వాహనాలకు రూ.20, కార్లకు రూ.50, భారీ వాహనాలకు రూ.100 చొప్పున పార్కింగ్ రుసుములు వసూలు చేస్తున్నారంటూ 'తొలివెలుగు' ప్రచురించిన కథనం ఇప్పుడు నిర్వాహకుల తాజా నిర్ణయంతో నిజమనే చర్చ భక్తుల్లో సాగుతోంది. వార్త వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు స్పందించే అవకాశం ఉందనే ఆందోళనతోనే నిర్వాహకులు అక్రమ వసూళ్లను నిలిపివేశారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**అధికారుల భయంతోనే వెనక్కి తగ్గారా?**

జిల్లా అధికారుల దృష్టికి వ్యవహారం చేరడంతో, ఎక్కడ విచారణకు ఆదేశాలు వస్తాయో, చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయంతోనే నిర్వాహకులు పార్కింగ్ వసూళ్లను తాత్కాలికంగా నిలిపివేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే అధికారులు వెళ్లిపోయిన తర్వాత మళ్లీ పాత విధానంలోనే వసూళ్లు ప్రారంభించే అవకాశం ఉందని కొందరు భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల ఈ వ్యవహారంపై దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు.

**మిగిలిన సమస్యలపై కూడా చర్యలు కావాలి:**

పార్కింగ్ వసూళ్లు నిలిపివేయడం శుభపరిణామమే అయినప్పటికీ ఆలయంలో ఉన్న ఇతర సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని భక్తులు పేర్కొంటున్నారు. లక్షల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, ముఖ్యంగా మహిళలకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి రావడం, తాగునీటి వంటి సౌకర్యాల కొరత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఆలయ పరిసరాల్లో బెల్ట్ షాపుల తరహాలో మద్యం విక్రయాలు జరగడం, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనుమతులు లేని దుకాణాల నిర్వహణ, ఆదాయ వ్యయాలపై పారదర్శకత లేకపోవడం వంటి అంశాలపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**పారదర్శక పరిపాలనే శాశ్వత పరిష్కారం:**

ఆలయ ఆదాయం, వ్యయాలపై పూర్తి పారదర్శకత తీసుకురావడంతో పాటు పార్కింగ్, అర్చనలు, ఇతర సేవలకు సంబంధించిన అన్ని రుసుములను అధికారికంగా ప్రకటించి మాత్రమే వసూలు చేసే విధానాన్ని అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు. దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా విచారణ జరిపి ఆలయ పరిపాలనలో ఉన్న లోపాలను సరిదిద్ది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రెవెన్యూ ఒకరిది... పెత్తనం మరొకరిదా?

రాచకొండ రెవెన్యూ పరిధిలో ఉన్న ఆలయ భూములపై చౌటుప్పల్ మండలానికి చెందిన కొందరు వ్యక్తుల ఆధిపత్యం కొనసాగుతోందన్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారం వెనుక రాజకీయ, అధికార వర్గాల అండదండలు ఉన్నాయా అనే కోణంలోనూ దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.


రెవెన్యూ ఒకరిది.. పెత్తనం మరొకరిది!

## 'తొలివెలుగు'కు భక్తుల అభినందనలు

పార్కింగ్ పేరిట ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అక్రమ వసూళ్లను వెలుగులోకి తీసుకువచ్చి వాటిని నిలిపివేసేలా చేయడంలో 'తొలివెలుగు' దినపత్రిక కీలక పాత్ర పోషించిందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్న 'తొలివెలుగు' యాజమాన్యానికి, సంపాదకవర్గానికి భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఆలయంలో మిగిలిన అక్రమాలు, లోపాలపై కూడా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని వారు ఆకాంక్షించారు.

# ఉద్యోగాలపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుటుంబానికే పదవులు
- పేపర్ లీకేజీ ఘటనలను తెలంగాణ సమాజం ఇంకా మర్చిపోలేదు
- గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



**తొలివెలుగు, ఎల్‌బీ నగర్ :** ఉద్యోగాల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడే నైతిక హక్కు లేదని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కల్వకుంట్ల కుటుంబానికే పదవులు, అవకాశాలు దక్కాయని, నిరుద్యోగ యువత మాత్రం తీవ్ర నిరాశకు గురైందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వేగవంతమైందని ఆయన పేర్కొన్నారు. టీజీపీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, విద్యుత్ సంస్థలు, ఆర్టీసీ, సింగరేణి, జలమండలి తదితర శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఉద్యోగాల విషయంలో యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకుండా వాస్తవాలను అంగీకరించాలని కేటీఆర్‌కు సూచించారు. తెలంగాణ ఉద్యమంలో యువత చేసిన త్యాగాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉద్యమ అమరవీరుల కుటుంబాలు, నిరుద్యోగ యువతకు తగిన న్యాయం చేయలేదని విమర్శించారు. పేపర్ లీకేజీ ఘటనలను తెలంగాణ సమాజం ఇంకా మర్చిపోలేదని, ఆ ఘటనల వల్ల వేలాది మంది నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపడుతూ యువతకు భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షంగా ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలను కూడా గుర్తించి మాట్లాడాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు స్వస్తి పలకాలని కేటీఆర్‌కు హితవు పలికారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాల కంటే పేపర్ లీకులు, కుటుంబ పాలన, అవినీతి, ప్రజాధన దుర్వినియోగమే ఎక్కువగా జరిగాయని ఆరోపించారు. గత పాలనలో జరిగిన వైఫల్యాలు, నిరుద్యోగ యువతకు జరిగిన నష్టంపై బీఆర్ఎస్ నాయకత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని చిలుక మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# భారత యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- ఇంద్రియాల గ్రామంలో ఏకగ్రీవ ఎన్నిక
- అధ్యక్షుడిగా శనిగారం సురేష్, ప్రధాన కార్యదర్శిగా జింక అనిల్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో ఆదివారం భారత యువజన సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రముఖ నాయకులు కరవాల శ్రీశైలం, శనిగారం పాండు, సురివి రాము ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా శనిగారం సురేష్, గౌరవ అధ్యక్షుడిగా పానుగంటి లింగస్వామి, ఉపాధ్యక్షుడిగా కరవాల సందీప్, ప్రధాన కార్యదర్శులుగా జింక అనిల్, శనిగారం చరణ్, కోశాధికారులుగా భీమగాని నరేష్, శెట్టి శ్రీమన్నారాయణ, సహాయ కార్యదర్శిగా కరవాల దిలీప్‌లు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా తాడూరు లింగస్వామి, బుర్రి శ్రీనివాస్, జింక మురళి, కుందారపు శంకర్, బంధారపు శివ, కరవాల విజయ్, అంతటి నవీన్, జింక శివకుమార్, లింగస్వామి, శివ, నందులు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

# చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గానికి సన్మానం

- పల్లెర్లలో వేడుకగా సత్కార కార్యక్రమం
- సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామన్న ప్రజాప్రతినిధులు

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** మండల పరిధిలోని పల్లెర్ల చేనేత సహకార సంఘ భవనంలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు పొడుగు వెంకటేశం, పాలకవర్గ సభ్యులను ఆదివారం ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కోడిత్యాల పద్మ నరేందర్ గుప్తా, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ఏలూరి సుదర్శన్‌లు నూతన అధ్యక్షుడిని, డైరెక్టర్లను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేనేత సహకార సంఘం బలోపేతానికి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ తండ మంజుల నర్సింహ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కోడిత్యాల పద్మ నరేందర్ గుప్తా, మాజీ అధ్యక్షుడు ఏలూరి సుదర్శన్, మాజీ ఉపాధ్యక్షుడు సాయిని అశోక్, మాజీ డైరెక్టర్లు గుర్రం వాసుదేవ్, ఏలే నిర్మల, గుర్రం మల్లేషం, ఏలూరి చంద్రకళలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కందగట్ల వెంకటేష్, కార్యదర్శి గుర్రం శ్రీనివాస్, కోశాధికారి సాయిని పురుషోత్తం, డైరెక్టర్లు గుర్రం మల్లేషం, వట్నాల వెంకటేష్, జంజీరాల సోమయ్య, ఏలూరి ధనలక్ష్మి వెంకటేశ్వర్లు, రాపోలు శ్వేత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# వైకూంఠధామంలో నీటి తిప్పలు తీర్చండి..

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రజకుల వినతి
- సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని స్మశాన వాటికలో బోరుబావి మంజూరు చేయాలని కోరుతూ రజక సంఘం ప్రతినిధులు ఆదివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేశారు. రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యేను కలిసి స్మశాన వాటికలో ఉన్న నీటి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను రజకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అంత్యక్రియల సమయంలో నీటి వసతి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే బోరుబావి మంజూరు చేసి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రజకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

- బీర్ల ఫౌండేషన్, ఉపసర్పంచ్ ఉదారత
- లక్ష్మయ్య కుటుంబానికి పరామర్శ

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట గ్రామానికి చెందిన ఎర్రగోకుల లక్ష్మయ్య ఇటీవల మృతి చెందగా, ఆదివారం వారి కుటుంబ సభ్యులను బీర్ల ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పరామర్శించారు. లక్ష్మయ్య మరణంతో ఇబ్బందుల్లో పడిన ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా నిత్యావసర వస్తువులను అందజేశారు. ఫౌండేషన్ తరఫున చైర్మన్ బీర్ల అనిత 50 కిలోల బియ్యాన్ని, అలాగే గ్రామ ఉపసర్పంచ్ నమిల కేదారి వ్యక్తిగతంగా 50 కిలోల బియ్యాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ నెమిల మహేందర్ గౌడ్, డాక్టర్ చింతల రవి, చింతల కోటయ్య, కొత్త కనకయ్య, అకిరెడ్డి తిమేశ్, గొల్లెన



స్వామి, పిండికుర మహేష్, కుతాటి రమేష్, ఎర్రగోకుల హన్మంతు, కొత్త ఉమేష్, శ్రీరాముల ప్రశాంత్, మెడిశెట్టి సురేష్, రేగు సిద్దులు, అంబేద్కర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.





# అంకిరెడ్డిగూడెంలో బెల్ట్ షాపులు, మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

- గ్రామపంచాయతీలో యాంటీ డ్రగ్స్ కమిటీ సమావేశం
- అక్రమ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరసింహారెడ్డి హెచ్చరిక

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం యాంటీ డ్రగ్స్, బెల్ట్ షాపుల నిర్మూలన కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ ఎస్ఐ నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణను పూర్తిగా అరికట్టాలని, ఎలాంటి అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా చూడాలని తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలపై ప్రజలతో పాటు కమిటీ సభ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామంలోని వ్యాపారులందరితో త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సర్పంచ్‌కు ఎస్ఐ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా మద్యం లేదా గంజాయి విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పోలీసు సందీప్, కమిటీ సభ్యులు నల్ల జయప్రద, బొల్లు అండాలు, ముద్దం భారతి, భీమగోని మల్లేశం గౌడ్, మోడం ముత్తయ్య గౌడ్, పర్నే శ్రీధర్ రెడ్డి, ఇటికాల నర్సిరెడ్డి, పర్ని శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# విహారయాత్రకు తరలిన పాడి రైతులు

- జెండా ఊపి ప్రారంభించిన మదర్ డైరీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, సర్పంచ్ కోయ మధు
- వేములకొండ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల కేంద్రంలోని మదర్ డైరీ పాల సొసైటీకి చెందిన పాడి రైతులు ఆదివారం ఉత్సాహంగా విహారయాత్రకు బయలుదేరారు. ఈ యాత్రను మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, గ్రామ సర్పంచ్ కోయ మధు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాడి రైతులు నిత్యం వ్యవసాయం, పశుపోషణ పనులతో నిమగ్నమై ఉంటారని, వారికి మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు పరస్పర స్నేహభావాన్ని పెంపొందించే ఉద్దేశంతో విహారయాత్రను నిర్వహించినట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు వారి మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. విహారయాత్రలో భాగంగా పాడి రైతుల బృందం వలిగొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములకొండ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు నిర్వహించింది. కుటుంబాలు సుఖశాంతులతో ఉండాలని, పశుసంపద వృద్ధి చెంది పాల ఉత్పత్తి మరింత పెరగాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్లు దోమల బాల పోశయ్య, దాచపల్లి రాజు, గాండ్ల నర్సింగరావు, డైరెక్టర్లు దోమల లక్ష్మణ్, రేగు కనకయ్య, సిగ్గుల సిద్దులు, అమాపురం పద్మ అయిలయ్య, రేగు అనిల్, వల్మలపల్లి నాగరాజు, బిల్లకుదురు కృష్ణ, ఎర్రగోకుల పోషమ్మ, చింతల సత్యం, 60 మందికి పైగా పాడి రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# టీఏఎంఏసీఎస్ ఎన్నికల్లో ఓటు వేసిన న్యాయవాది నరసింహారెడ్డి

- సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో పోలింగ్
- పాల్గొన్న చౌటుప్పల్ ప్రభుత్వ న్యాయవాది




**తొలివెలుగు, చౌటుప్పల్:** రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని 'ది అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్' (టీఏఎంఏసీఎస్) ఎన్నికలు ఆదివారం సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో జరిగాయి. ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో చౌటుప్పల్ సివిల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది (జీపీ), చౌటుప్పల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి పాల్గొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యాయవాదుల సహకార సంఘం బలోపేతానికి, సంక్షేమానికి ఈ ఎన్నికలు ఎంతో కీలకమని ఈ సందర్భంగా న్యాయవాదులు పేర్కొన్నారు. జంటనగరాల పరిధితో పాటు రంగారెడ్డి జిల్లా పరిధిలోని వివిధ కోర్టులకు చెందిన న్యాయవాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చౌటుప్పల్ ప్రాంతం నుంచి అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాకిటి నరసింహారెడ్డి స్వయంగా వెళ్లి ఓటు వేయడం పట్ల తోటి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## అఖిలపక్ష భేటీలో రగడ

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే రాజకీయ యుద్ధం మొదలైంది. ఆదివారం పార్లమెంట్ భవనంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్ సహా 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున పార్టీ పార్లమెంటరీ పక్ష నేతలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు ఎంపీలను ఈ సమావేశానికి ఆహ్వానించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎన్‌సీపీఐ)లో టీఎంసీ రెబెల్ ఎంపీల విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఇంకా అధికారికంగా పూర్తిస్థాయి ఆమోదం తెలపలేదని, రికార్డుల ప్రకారం తమ పార్టీ బలం ఇంకా 28గానే ఉందని తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా ప్రస్తావించారు. టీఎంసీ రెబల్స్‌ను అఖిలపక్ష భేటీకి పిలిచినందుకు నిరసనగా కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, శివసేన(యూబీటీ), డీఎంకే, ఆప్, జేఎంఎం, ఆర్జేడీ సహా వామపక్ష పార్టీల నాయకులు అఖిలపక్ష సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి మళ్లీ అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 131వ రాజ్యాంగ సవరణ బిల్లు--2026(లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచే డీలిమిటేషన్ బిల్లు)పై కాంగ్రెస్ సభ్యులు ఖర్గే, ప్రమోద్ తివారీ నిరసన వ్యక్తం చేశారు. నీట్--యూజీ పేపర్ లీకేజీలు, అయోధ్య రామాలయ ట్రస్టులో కోట్ల రూపాయల విరాళాల చోరీ, ఈ20 పెట్రోల్ వంటి అంశాలను పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్‌చేశారు. నియోజకవర్గాల పునరి?వభజన బిల్లుకు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ) మద్దతు ఇస్తుందంటూ వస్తున్న ఊహాగానాలను ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే కొట్టిపారేశారు. అయోధ్య రామమందిర విరాళాల చోరీ, ఇథనాల్ బ్లెండింగ్, విద్యార్థుల సమస్యలు, మణిపూర్లో కల్లోలం తదితర కీలక సమస్యలు, తాజా పరిణామాలపై వర్షాకాల సమావేశాల్లో తప్పనిసరిగా చర్చించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డీఎంకే సభ్యుడు టిఆర్ బాలు విన్నవించారు. శివసేన(యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు షిండే సారథ్యంలోని శివసేన పార్టీలో చేరడం, వారి విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఆమోదం తెలపడం అన్యాయమని శివసేన(యూబీటీ) సభ్యుడు అరవింద్ సావంత్ స్పష్టంచేశారు. తమ పార్టీకి చెందిన 10 మంది రాజ్యసభ సభ్యుల్లో ఏడుగురు బీజేపీలో చేరడాన్ని 'హైజాక్'గా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎన్.డి.గుప్తా అభివర్ణించారు. ఇది చెల్లుతుందా లేదా అని తేల్చాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు.

**సభలు సజావుగా సాగేలా సహకరించండి**

ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై పార్లమెంటరీ నిబంధనలను లోబడి సమగ్రమైన చర్చలు జరపడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి రాజ్‌నాథ్ వెల్లడించారు. సభలో గందరగోళం సృష్టించడం కంటే అర్థవంతమైన చర్చలకే ప్రాధాన్యం ఇవ్వాలని విపక్షాలను కోరారు. చట్టసభల సమయం వృథా కాకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ఉభయ సభల కార్యకలాపాలు సజావుగా సాగడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో ఎనిమిది బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు రిజిజు చెప్పారు. గతంలో మెజార్టీ లేక ఆమోదం పొందని రాజ్యాంగ సవరణ బిల్లులపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

## కేటీఆర్ రక్తంలో నిజాయితీ, కృతజ్ఞత లేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరూర్ నగర్ సభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సభలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై కేటీఆర్ 'డెత్ డిక్లరేషన్' అంటూ మాట్లాడటంపై ఆయన తీవ్ర కౌంటర్ ఇచ్చారు. అసలు కేటీఆర్‌కు ఏమాత్రం రాజకీయ నియత్ (నిజాయితీ) ఉందా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. విలువలతో కూడిన రాజకీయం గాంధీ కుటుంబానిదైతే.. విలువలు లేని రాజకీయాలు కేసీఆర్ కుటుంబానివని మండిపడ్డారు. ఆనాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇస్తే సోనియా గాంధీకి తన చర్మం వొలిచి చెప్పులు కుట్టిస్తానని కేసీఆర్ అన్న మాటలను జగ్గారెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీ కాళ్లు మొక్కిన సంగతిని ఇప్పుడు ఎలా మర్చిపోతారని నిలదీశారు. నాడు కాళ్లు మొక్కి, ఇప్పుడేమో అదే గాంధీ కుటుంబంపై డెత్ డిక్లరేషన్ ప్రకటిస్తావా అంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. కేటీఆర్ రక్తంలో ఎక్కడా నిజాయితీ, కృతజ్ఞతా భావం లేవని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఆ కుటుంబం నాశనాన్ని కోరుకోవడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1 పేపర్ లీక్ అయినప్పుడు, కేటీఆర్ అశోక్ నగర్ వెళ్లి ఏ రోజైనా నిరుద్యోగులకు సమాధానం చెప్పారా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. నాడు నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుని, ఇవాళ నీతులు చెబుతున్నారని విమర్శించారు. గాంధీ కుటుంబం ఏనాడైనా మాట ఇస్తే దానికి కట్టుబడి నిలబడుతుందని, కానీ కేసీఆర్ కుటుంబం మాత్రం మాట ఇస్తే మోసం చేయడమే అలవాటుగా మార్చుకుందని దుయ్యబట్టారు.

## చల్లారని పశ్చిమాసియా

దుబాయ్, జూలై 19: పశ్చిమాసియాలో 8వ రోజు కూడా దాడులు కొనసాగాయి. జోర్డాన్‌లో అమెరికా దళాలపై శనివారం ఇరాన్ చేసిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ లక్ష్యాలపై విరుచుకుపడినట్టు యూఎస్ మిలిటరీ ఆదివారం ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ సైనిక కోస్తా నిఘా, వాయు రక్షణ వ్యవస్థలు, క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలపై దాడులు చేసినట్టు తెలిపింది. ఈ దాడిని ఇరాన్ అటామిక్ ఎనర్జీ ఆర్గనైజేషన్ ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఆరోపించింది. ఈ దాడిపై అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) స్పందించింది. తమ సంస్థ సభ్యులు గతంలో ఆ కేంద్రాన్ని సందర్శించినప్పుడు, అది నిర్మాణ దశలో ఉందని అందులో ఎలాంటి అణు పదార్థాలు లేవని తెలిపింది.

# నేటి నుంచి వర్షాకాల సమరం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త బిల్లులు, రెండు పెండింగ్ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. అయోధ్యలోని రామాలయంలో కోట్ల కొలది విరాళాల చోరీ, నీట్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, మోదీ సర్కార్ విదేశాంగ విధానంపై నిలదీసేందుకు ప్రతిపక్షాలు అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తగిన సంఖ్యాబలం లేక వీగిపోయిన మహిళా రిజర్వేషన్ల బిల్లు, లోక్‌సభ నియోజకవర్గాల డీలిమిటేషన్ రాజ్యాంగ సవరణ బిల్లులను ఈసారి అజెండాలో లేకపోయినా వీటిపై ముందుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దేశంలో పన్నుల వ్యవస్థను మరింత సరళీకృతం చేయడం, కొన్ని నిబంధనలను సవరించడం, పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించడమే లక్ష్యంగా ఆదాయపు పన్ను(సవరణ) బిల్లు--2026ను వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. విదేశీ నిధులు స్వీకరించే సంస్థలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు, పారదర్శకత పెంపు, పర్యవేక్షణను బలోపేతం కోసం విదేశీ విరాళాల నియంత్రణ(సవరణ) బిల్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రుణ సౌలభ్యం, వ్యాపార నిర్వహణలో సరళీకరణ, పెట్టుబడుల ప్రోత్సాహం కోసం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్కరణ బిల్లు, పుట్టిన తేదీ నమోదు, డిజిటల్ రికార్డులు, పరిపాలనా ప్రక్రియలను మరింత సమర్థవంతంగా మార్చే ప్రతిపాదనతో జనన నమోదు చట్ట సవరణ బిల్లుతోపాటు జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగ విలువలకు సంబంధించిన చట్టాలను నవీకరించేందుకు జాతీయ గౌరవ అవమాన నివారణ(సవరణ) బిల్లు--2026ను కేంద్రం ప్రవేశపెట్టనుంది. రెండు పెండింగ్ బిల్లులను తదుపరి ఆమోదం కోసం పార్లమెంట్ ముందుకు తీసుకురానుంది. ఇందులో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు వీలుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య(సవరణ) బిల్లు ఉంది. పెరుగుతున్న కేసుల భారం తగ్గించి, పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే ధ్యేయంగా ఈ బిల్లును రూపొందించారు. ఉన్నత విద్యా రంగంలో సంస్కరణల కోసం వికసిత్ భారత్ విద్యా అధిష్టాన్ బిల్లు--2025ను సైతం కేంద్రం ప్రవేశపెట్టనుంది.

**అవినీతి, ధరల పెరుగుదల..**

వర్షాకాల సమావేశాల్లో మోదీ ప్రభుత్వం విధానాలను ఎండగట్టేందుకు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతి, రాజ్యాంగబద్ధ సంస్థల దురి?వనియోగం, విపక్షాలను విచ్ఛిన్నం చేయడం, ధరల పెరుగుదల, విదేశాంగ విధానంలో వైఫల్యాలు, వ్యూహాత్మక తప్పిదాలు, ఇథనాల్ బ్లెండింగ్ విధానాలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలపై దాడులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్ సన్నద్ధమైంది. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడంపైనా ఆందోళన చేపట్టాలని ప్రతిపక్షాల నిర్ణయించాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఉభయ సభల్లో డిమాండ్ చేయబోతున్నాయి. 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతు పలకడం, శివసేన(యూబీటీ)లో చీలికలు, డీఎంకే దూరం జరగడం వంటి పరిణామాల నేపథ్యంలో విపక్షాల ఐక్యత, బలం కాస్తంత తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని విపక్ష నాయకులు ఎంతమేరకు ఎదుర్కొంటారన్నది చూడాల్సి ఉంది. సమావేశాలు వాడీవేడిగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. జాతీయ గేయం 'వందేమాతరం'ను అవమానించడం, ఆలాపనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం నేరంగా పరిగణించేలా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్‌సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (సవరణ) బిల్లు--2026'ను నేడు రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుకు ఇప్పటికే కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తే, ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జనగణమన'కు ఉన్న చట్టపరమైన రక్షణ 'వందేమాతరం'కూ వర్తించనుంది.

## రామాయపట్నం పోర్టుపై జగన్ ట్వీట్...

రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

**రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం**

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

## ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమానాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి.

## ఏపీలో మళ్లీ కరోనా కలకలం..

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పెరుగుతున్నాయి. తాజాగా నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు కొత్త కేసులు వెలుగులోకి రావడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివరాల్లోకి వెళ్తే, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స నిమిత్తం పుదుచ్చేరిలో ఉండగా, అతనికి కరోనా సోకినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, బాలుడి కుటుంబ సభ్యులకు, సమీప బంధువులకు నిర్వహించిన పరీక్షల్లో నెగటివ్ అని తేలింది. మరోవైపు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో డయాలసిస్ చేయించుకుంటోంది. జ్వరం, ఇతర లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించగా, ఆమెకు కోవిడ్ పాజిటివ్‌గా తేలింది.

# గాంధీభవన్‌కు రావొద్దు..

(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులు గాంధీభవన్‌కు రావొద్దు. అలాంటి వారికి అసలు అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు. కొందరు నాయకులు హైదరాబాద్‌లో కూర్చుని పనిచేయడం లేదు. హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు..' అని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ పనితీరు గురించి ఆదివారం ఆయన జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

**30న మళ్లీ సమీక్ష**

'ఎస్ఐఆర్‌పై పార్టీ పక్షాన ఇప్పటివరకు 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 489 సమావేశాలు జరిగాయి. కొన్ని చోట్ల బాగానే జరుగుతున్నా మరికొన్ని చోట్ల వెనుకబడ్డాం. ఇప్పటికైనా ఆయా నియోజకవర్గాల్లోని నేతలు ఎస్ఐఆర్‌పై దృష్టి పెట్టాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎస్ఐఆర్ కోసం నియమించిన పార్టీ ఇన్‌చార్జిలు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. బీఎల్ఏ, బీఎల్‌వోల రిపోర్టులను గాంధీభవన్ టీం ఎప్పటికప్పుడు పరిశీలించి సూచనలివ్వాలి. ఇన్‌చార్జి మంత్రులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలి. ఏది జరిగినా వారిదే బాధ్యత. ఈ నెల 30వ తేదీన మళ్లీ పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించి మరోమారు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు తీసుకుంటాం..' అని రేవంత్ స్పష్టం చేశారు.

**100 మందికి రాహుల్‌తో ఫొటోకు చాన్స్**

'జిల్లాల వారీగా ఎస్ఐఆర్ కార్యక్రమాలపై అన్ని జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సోమవారం సమీక్షలు జరుపుతారు. ఎంపీలు పార్లమెంటు సమావేశాల్లో ఉన్నా ఎస్ఐఆర్‌పై దృష్టి సారించాల్సిందే. పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌చార్జిలుగా ఉన్నవారు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. ఇన్‌చార్జిలుగా ఎంపీలున్నా క్షేత్రస్థాయికి వెళ్లి పనిచేయాల్సిందే. లేదంటే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుంది. పూర్తిగా బీఎల్‌వోల రిపోర్టులపై ఆధారపడొద్దు. బీఎల్ఏల రిపోర్టులను పరిశీలించాలి. పార్టీ పరంగా పనిచేస్తున్న నేతలు ఈ బీఎల్ఏలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. అలా ఉపయోగించుకోవాలంటే పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండి పనిచేయాలి. ప్రతి ఒక్కరూ సీరియస్‌గా ఉండాలి. బాగా పనిచేసే 100 మందికి రాహుల్‌గాంధీతో ఫొటో దిగే అవకాశం కల్పిస్తాం. ఎస్ఐఆర్ విషయంలో పార్టీ కార్యక్రమాలన్నింటికీ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం కభట్టి విక్రమార్క బాధ్యత తీసుకోవాలి. అందరినీ సమన్వయం చేయాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు.

**జాగ్రత్తగా వ్యవహరించాలి: మహేశ్‌గౌడ్**

టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా కీలకమైందని, ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని, చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం ద్వారా పార్టీకి జరిగిన నష్టాన్ని గుర్తించైనా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోకుండా జాగ్రత్త తీసుకోవాలని మహేశ్‌గౌడ్ కోరారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# 72వ జాతీయ చలనచిత్ర అవార్డులు - 2026

## భారతీయ సినీ ప్రతిభకు జాతీయ గౌరవం








# 'ఆర్టికల్ 370'కు జాతీయ కిరీటం..!

### ఉత్తమ నటుడు



మమ్ముట్టి
(Bramayugam)

### ఉత్తమ నటుడు



కార్తిక్ ఆర్యన్
(Chandu Champion)




BEST FEATURE FILM
ఉత్తమ ఫీచర్ ఫిల్మ్
ARTICLE 370

### ఉత్తమ నటి




యామి గౌతమ్
(Article 370)

### ప్రాంతీయ ఉత్తమ చిత్రాలు



తెలుగు
Committee Kurrollu




తమిళం
Raayan



మలయాళం
Feminichi Fathima




కన్నడ
Blink

### ఉత్తమ దర్శకుడు



రాజ్‌కుమార్ పెరియసామి
(Amaran)

### ఉత్తమ నేపథ్య సంగీతం



జి.వి. ప్రకాష్ కుమార్
(Amaran)

### ఉత్తమ ఎడిటింగ్



ఆర్. కలైవాణన్
(Amaran)

### ఈసారి ప్రత్యేకతలు

- ★ 'ఆర్టికల్ 370' ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నిలిచింది.
- ★ 'అమరన్' మూడు ప్రధాన జాతీయ అవార్డులు దక్కించుకుంది.
- ★ 'పుష్ప 2 : ది రూల్' పలు సాంకేతిక విభాగాల్లో గుర్తింపు.
- ★ దక్షిణ భారత చిత్రాలు దర్శకత్వం, రచన, సాంకేతిక రంగాల్లో మరోసారి తమ సత్తా చాటాయి.




### 'అమరన్'కు త్రివిధ విజయం

| దర్శకుడు | నేపథ్య సంగీతం | ఎడిటింగ్ |
|---|---|---|
| రాజ్‌కుమార్ పెరియసామి | జి.వి. ప్రకాష్ కుమార్ | ఆర్. కలైవాణన్ |

మూడు జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న చిత్రం

### ప్రత్యేక అవార్డులు

- ఉత్తమ బాలల చిత్రం
- ఉత్తమ డాక్యుమెంటరీ
- ఉత్తమ నాన్ ఫీచర్ ఫిల్మ్
- ఉత్తమ సినిమాటోగ్రఫీ
- ఉత్తమ సౌండ్ డిజైన్
- ఉత్తమ వచన రచన


మరికొన్ని సాంకేతిక అవార్డులు




### ఇతర ముఖ్యంగా గుర్తింపు పొందిన చిత్రాలు




PUSHPA 2
THE RULE



12TH FAIL




LAAPATAA LADIES



ANIMAL




KALKI
2898 AD

" సినిమా అనేది కేవలం వినోదం కాదు.. అది సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి "
– జాతీయ చలనచిత్ర అవార్డులు